





తప్పుకదా గోవిందా..!

● అధికార పార్టీ స్టిక్కర్‌తో తిరుమలకు వచ్చిన కారు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వైసీపీ స్టిక్కర్‌తో ఉన్న కారు శనివారం తిరుమలలో కనిపించింది. సాధారణంగా రాజకీయ పార్టీ జెండాలు, గుర్తులు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే ఏపీ 02 ఏపీ 3699 నెంబరు గల కారుపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఉంచి తిరుమలకు తీసుకువచ్చారు. కారును తిరుమలలోని పరకాలస్వామి మఠం వద్ద పార్కింగ్ చేసి వెళ్లారు. నిబంధనలను ఉల్లంఘించినా టీటీడీ భద్రతా సిబ్బంది మాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉండిపోవడం గమనార్హం. ఈ ఘటనతో అలిపిరిలో తనిఖీలపై కూడా విమర్శలు వచ్చాయి.

మఠం ముందు అధికార పార్టీ స్టిక్కర్‌తో కారు



● తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలో...

నేడే ముగ్గుల పోటీలు

తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. తిరుపతి నగరంలో ఇందిరా మైదానం(తుడా మైదానం), చిత్తూరులో ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణ మండపం (నాయుడు బిల్డింగ్స్, విజయ డిగ్రీ కాలేజీ దగ్గర), మదనపల్లెలో జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపిక కాబడిన ఇద్దరు, మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. తిరుపతిలో జరిగే పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్, చిత్తూరులో జరిగే పోటీలకు విజయం విద్యాసంస్థలు, మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పండగకు 233 అదనపు బస్సులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రధాన నగరాలకు అదనంగా 233 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. ● 10, 11, 12 తేదీల్లో హైదరాబాదుకు 15, బెంగళూరుకు 40, చెన్నైకి 17, విజయవాడకు 11, ఇతర మార్గాలకు 55 ● 15, 16, 17 తేదీల్లో హైదరాబాదుకు 16, బెంగళూరుకు 1, చెన్నైకి 16, విజయవాడకు 8, ఇతర మార్గాలకు 10 బస్సుల చొప్పున ఉన్నాయి.

మీరే దిక్కు..!

టికెట్ల కోసం వైసీపీలో వేడుకోళ్లు





తిరుపతి జిల్లాలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ స్థానాల్లో తిరిగి పోటీ చేయడానికి ఆఖరి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ఒక్కోరు ఒక్కో దారి ఎంచుకున్నారు. అధినేత నిర్ణయం కోసం అభద్రతతో వీరు దినదినగండంగా రోజులు గడుపుతున్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలుండగా అందులో సగం సెగ్మెంట్లలో వైసీపీ టికెట్ ఎవరికన్నది తేలక శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. మరోవైపు ఆశావహులూ తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

విజయవాడలో కేజే దంపతుల మకాం

నగరి వైసీపీ టికెట్ ఆశిస్తూ మున్సిపల్ మాజీ చైర్మన్లు కేజే కుమార్, కేజే శాంతి దంపతులు వారం రోజుల నుంచి విజయవాడలోనే మకాం వేశారు. నగరి సెగ్మెంట్‌లో మంత్రి రోజాను తొలినుంచీ వ్యతిరేకిస్తున్న వైసీపీ నేతల్లో వీరు ముఖ్యులు. రోజా వ్యతిరేక బృందంలోని శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట మండల నేత మురళీధర్‌రెడ్డి కూడా వారం కిందట విజయవాడకు వెళ్లారు. సీఎం సన్నిహితులను కలసి రోజాకు టికెట్ కేటాయించవద్దని గట్టిగా పట్టుబట్టారు. ఆమెకు కాకుండా తమలో ఎవరికి ఇచ్చినా పర్లేదని, కొత్తవారికి ఇచ్చినా అభ్యంతరం లేదని ప్రతిపాదించారని తెలుస్తోంది. కీలక నేతల ద్వారా సీఎం జగన్‌ను కలిసే ప్రయత్నం చేశారు. అయితే అధినేతను ఎట్టి పరిస్థితుల్లోనూ కలవద్దని, కలిస్తే నచ్చజెప్పి రోజా గెలుపు కోసం పనిచేయాల్సిందిగా జగన్ ఒప్పిస్తారని చిత్తూరు ప్రాంతానికి చెందిన ఓ నేత సలహా ఇవ్వడంతో నిజమేననిపించి చక్రపాణిరెడ్డి, మురళీధర్‌రెడ్డిలు వెనుదిరిగి వచ్చేసినట్టు సమాచారం. అయితే కేజే కుమార్ దంపతులు పట్టుదలగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు వారి సన్నిహితులు చెబుతున్నారు.

మిమ్మల్నే నమ్ముకున్నాం

సత్యవేడు నుంచీ తిరిగి టికెట్ దక్కడంపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం కుమారుడు సుమన్‌ను వెంటబెట్టుకుని మంత్రి పెద్దిరెడ్డిని కలిశారు. మిమ్మల్నే నమ్ముకున్నాం, మీరే దిక్కంటూ తండ్రీ కొడుకులిద్దరూ ఆయన పాదాలపై పడినంత పనిచేశారు. మంత్రి మాత్రం తన చేతుల్లో ఏమీ లేదని, అధినేత జగన్ నిర్ణయానుసారమే టికెట్ల కేటాయింపు జరుగుతుందని చెబుతూనే తన వంతు మాటసాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. తండ్రీకొడుకులు పెద్దిరెడ్డిని కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అందులో ఎమ్మెల్యే, ఆయన తనయుడు మంత్రి ఎదుట చేతులు కట్టుకుని అత్యంత వినయంగా నిల్చొని ఉండడం, మంత్రి కాళ్లకు దండం పెడుతున్నట్టుగా ఉండడం వంటివి దళిత సామాజిక వర్గాల్లో విద్యావంతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి. రాజకీయ భవిష్యత్తు కోసం అగ్రవర్ణాల నేతల వద్ద ఇంతగా సాగిలబడడం ఏమిటన్న ఆగ్రహం వారిలో వ్యక్తమవుతూండడం గమనార్హం. మరోవైపు పూతలపట్టు ప్రాంతానికి చెందిన ఓ పోలీసు సీఐ భార్య పేరు కొత్తగా ఇక్కడ తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లోనే ఆమె టికెట్ కోసం యత్నించగా దాదాపు ఖరారై చివరి క్షణంలో చేజారిపోయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



గూడూరు తెరపైకి మరొక పేరు

గూడూరు నుంచి వైసీపీ టికెట్ కోసం యత్నిస్తున్న వారిలో తాజాగా మన పాటి రవీంద్రబాబు పేరు తెరపైకి వచ్చింది. గూడూరు పట్టణంలో రెండు విద్యాసంస్థలను కలిగి ఉన్న ఇతను 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసి 27,375 ఓట్లు సాధించారు. పీఆర్పీ.. కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కొంతకాలం కాంగ్రెస్‌లో కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. మూడేళ్లుగా హైదరాబాదులో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. సీఎం సన్నిహితుల్లో ఒకరి ద్వారా ప్రస్తుతం టికెట్ రేసులో నిలిచారు. గూడూరులో స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న ప్రతిపాదనలో భాగంగా సీఎం సన్నిహితులొకరు ఇతడి పేరు సూచించినట్టు సమాచారం. దీంతో ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌ను కాదని టికెట్ రేసులో ఉన్న ఓ రెవెన్యూ అధికారి, ఎమ్మెల్సీ మేరుగ మురళీధరరావుల తోపాటు తాజాగా రవీంద్ర బాబు కూడా చేరారు.

జగన్ కోర్టులో సూళ్లూరుపేట బంతి

సూళ్లూరుపేట వైసీపీ టికెట్ ఈసారి ఎవరికి దక్కుతుందనే విషయంలో ఇప్పటికీ స్పష్టత రాలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఈసారి టికెట్ ఇవ్వొద్దని పలువురు పార్టీ నేతలు గట్టిగా పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన పంచాయితీలు కూడా ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చలేకపోయాయి. దీంతో ఇపుడు బంతి నేరుగా సీఎం జగన్ కోర్టుకు చేరింది. అక్కడ ఏమి జరుగుతోందో పార్టీ వర్గాలకు తెలియడం లేదు. మరో నాలుగైదు రోజుల్లో టికెట్ విషయమై స్పష్టత వస్తుందని ఇరువర్గాలూ చెబుతున్నాయి.

'ఎస్మా' ప్రయోగిస్తారా?

● జీవో ప్రతులను తగులబెట్టిన అంగన్వాడీలు



కోటలో జీవో ప్రతులను తగులబెడుతున్న అంగన్వాడీలు



తిరుపతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న తమపై ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం పట్ల అంగన్వాడీ ఉద్యోగులు శనివారం జిల్లావ్యాప్తంగా ఆందోళనకు దిగారు. నిరవధిక సమ్మెలో భాగంగా ఓవైపు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూనే మరోవైపు ఎస్మా ప్రయోగానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నాయుడుపేట, కోటల్లో రిలే నిరాహార దీక్ష కొనసాగించిన ఉద్యోగులు శిబిరం వద్ద ఎస్మా ప్రయోగానికి సంబంధించిన జీవో నెంబరు-2 ప్రతులను తగులబెట్టారు. తిరుపతిలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద, సత్యవేడు, పిచ్చాటూరుల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చంద్రగిరిలో రిలే నిరాహార దీక్షా శిబిరంలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేయగా.. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, పుత్తూరు, శ్రీకాళహస్తి తదితర చోట్ల రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

తిరుపతిలో ఎస్మా చట్టం ప్రతులను తీసుకోవడానికి నిరాకరణ

వెనుదిరిగిన తిరుపతి సీడీపీవో

ఎస్మా చట్టానికి సంబంధించిన జీవో ప్రతులను ఇవ్వడానికి శనివారం సాయంత్రం తిరుపతిలోని అంగన్వాడీల దీక్షా శిబిరానికి సీడీపీవో సుధారాణి వచ్చారు. దాంతో సమస్యలు పరిష్కరించకుండా ఇదేంటని ప్రశ్నిస్తూ.. ప్రతులను తీసుకోవడానికి నిరాకరించారు. దాంతో ఆమె చేసేదేమీలేక వెనుదిరిగారు.



చంద్రబాబు ఇంటికి సంక్రాంతి ముస్తాబు

చంద్రగిరి, జనవరి 6: మాజీ సీఎం చంద్రబాబు తన కుటుంబీకులతో కలిసి సంక్రాంతి పండగకు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. వీరితోపాటు నందమూరి కుటుంబీకులు కూడా వస్తున్న విషయం తెలిసిందే. దాంతో నారావారిపల్లెలోని ఆయన ఇంటిని ముస్తాబు చేస్తున్నారు. ఇంటికి పెయింటింగ్ వేసి, ఆవరణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధులు, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పార్కింగ్, భద్రతా సిబ్బంది ఉండటానికి టీటీడీ కళ్యాణ మండపంలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా టీటీడీ కళ్యాణ మండపం, అతిథి గృహాన్ని ముందుగా బుక్ చేశారు.

వెంకటగిరి పర్యటన వాయిదా

వెంకటగిరి, జనవరి 6: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 9వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో నిర్వహించనున్న రా కదలిరా బహిరంగ సభ వాయిదా పడినట్లు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషన్‌తో అత్యవసర సమావేశం ఉందన్నారు. అందువల్ల చంద్రబాబు పర్యటన వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలోనే పర్యటన తేదీ ఖరారు చేస్తామని వివరించారు. అయితే మరోవైపు వెంకటగిరి- తిరుపతి రోడ్డు మార్గంలో బహిరంగ సభా ప్రాంగణంలో ఏర్పాట్లు మాత్రం చురుగ్గా సాగుతూనే ఉన్నాయి.

సినీ ఫక్కీలో ఆటోడ్రైవర్ కిడ్నాప్

- దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. విజయవాడకు పయనమైన అయ్యప్ప భక్తులు
- అడ్డుకుని, బాధితుడిని విడిపించిన పోలీసులు
- శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించిన ఘటన

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ ఆటో డ్రైవర్‌పై అయ్యప్ప భక్తులు దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించింది. స్థానికులు పోలీసులు అడ్డుకుని, బాధితుడిని విడిపించి 14 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలానికి చెందిన ధర్మేంద్ర శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మచిలీపట్నానికి చెందిన కొందరు భక్తులు శబరిమల యాత్రకు వెళ్లారు. దీక్ష విరమించాక తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తికి శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం టూరిస్టు బస్టాండు వద్ద మరో బస్సులోని భక్తులతో మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దిగారు. దీన్ని గమనించిన ఆటో డ్రైవర్ ధర్మేంద్ర వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మచిలీపట్నానికి చెందిన అయ్యప్ప భక్తులు ఆటో డ్రైవర్‌ని దుర్భాషలాడారు. ఆగ్రహించిన ఆటోడ్రైవర్ దగ్గరలోని కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో బస్సు అద్దంపై దాడిచేశాడు. అద్దం ధ్వంసమవడంతో ఆ వాహన డ్రైవర్ విజయవాడకు చెందిన బస్సు యజమానికి ఫోన్‌ద్వారా విషయం తెలిపాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అయ్యప్ప భక్తులు వెంటనే ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు. బలవంతంగా బస్సులోకి తోశారు. అక్కడున్న స్థానికులు గమనించి బస్సును అడ్డుకున్నారు. అందుకువారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కె వెళ్లి ఫిర్యాదు చేస్తామని, నమ్మించి బస్సులో విజయవాడకు బయల్దేరారు. విషయాన్ని అప్పటికే కొందరు స్థానికులు 100కు ఫోన్‌చేసి.. పోలీసులకు తెలియజేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కూడా ఎంతసేపటికీ బస్సు పోలీస్‌స్టేషన్ వద్దకు రాకపోవడంతో వన్‌టౌన్ సీఐ అంజుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బస్సు నెంబరు ద్వారా పోలీసులు సంబంధిత వాహన యజమాని వివరాలు గుర్తించి, ఫోన్లో సంప్రదించారు. 'ఆటో డ్రైవర్‌ను వదిలే ప్రసక్తే లేదు.. ఏం చేస్తారో చేసుకోండి. నేను అధికార పార్టీ నాయకుడిని' అంటూ ఆ యజమానికి పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోడ్రైవర్ సెల్‌ఫోన్ ఆధారంగా బస్సు.. పొదలకూరు వద్ద వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి ఆ బస్సును అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి పోలీసులు పొదలకూరు చేరుకుని, ధర్మేంద్రను విడిపించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం శనివారం వేకువజామున శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయ్యప్ప భక్తులతోసహా బస్సును శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు కాకుండా కొందరు అధికార పార్టీ నేతలు ఫోన్ల ద్వారా అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా 14మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి.. బస్సును ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్‌లో పెట్టారు.



చికిత్స పొందుతున్న ధర్మేంద్ర

మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలి

● మంత్రి బొత్స దిష్టిబొమ్మతో ఏబీవీపీ నిరసన ● దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

తిరుపతి(విద్య), జనవరి 6: రాష్ట్రంలో వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఏబీవీపీ కన్వీనర్ రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బీఈడీ, డీఈడీ, బీపీఈడీ అభ్యర్థులతో కలసి శనివారం తిరుపతిలోని బాలాజీకాలనీ సర్కిల్‌లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దిష్టిబొమ్మతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బొత్స ఇంక లేరు అన్న బ్యానర్‌నూ ప్రదర్శించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనానికి పూనుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లగా నిరుద్యోగులు ఎంతో ఆశగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్‌ని విడుదల చేస్తామని మాటిచ్చిన సీఎం జగన్ ఇప్పటివరకు ఒక డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకపోవడం బాధాకరమని వాపోయారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీని విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పవన్‌కుమార్, అభ్యర్థులు పాల్గొన్నారు.



దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



బొత్స దిష్టిబొమ్మతో ఏబీవీపీ నాయకులు, అభ్యర్థులు



మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

చంద్రగిరి, జనవరి 6: చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్లు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ల సమ్మె 26వ రోజుకు చేరింది. ఈసందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ ఎస్మా చట్టం ఎవరికి వర్తిస్తుందో అసలు ముఖ్యమంత్రి జగన్‌కు తెలుసా అని ప్రశ్నించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులు అంటున్నారు.. అయితే వేతనాలు మాత్రం వారికి ఇచ్చే విధంగా ఎందుకు ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

9నుంచి శ్రీరామ్ కథా జ్ఞానయాగ మహోత్సవం



భక్తాంజనేయస్వామి ఆలయంలో యాగం ఏర్పాట్లు

చంద్రగిరి, జనవరి 6: శ్రీవారి మెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 9నుంచి 16వ తేదీ వరకు శ్రీరామ్ కథాజ్ఞాన యాగ మహోత్సవం నిర్వహించను న్నారు. తిరుపతికి చెందిన రాజస్థానీ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించను న్నారు. కృపారామాజీ మహారాజ్, రాజారామాజీ మహారాజ్ గురువుల చేత ఈయాగం జరుగుతుంది. 9న భవ్యశోభ కలశ యాత్ర నిర్వహిస్తారు. ఈనెల 17న పూర్ణాహుతితో యాగం ముగియనుంది. యాగం సందర్భంగా భక్తాంజనేయస్వామి ఆలయ ఆవరణలో చలువ పందిళ్ళు, హోమ గుండాలు తదితర ఏర్పాట్లు శరవేగంగా చేస్తున్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

పాకాల, జనవరి 6: అంబేడ్కర్ భవనం సమీపంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాటూరు మోహన్, విశ్రాంత తహసీల్దార్ కె.సుధాకరయ్య మాట్లాడుతూ ప్రశాంతంగా వున్న దళితవాడల్లో వైసీపీ కండువాలు కప్పి కలహాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. అధికార బలంతో సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వలంటీర్ల ద్వారా అమాయకులకు కండువాలు కప్పి పార్టీలో చేరకపోతే పథకాలను కట్ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఈ పద్ధతులు మానుకోకపోతే రాబోవు రోజుల్లో దళితులంతా ఏకమై పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

నూతన కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



పాకాల, జనవరి 6: పాకాలలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాన్ని జిల్లా జడ్జి భీమారావ్ శనివారం సాయంత్రం పరిశీలించారు. నూతన కోర్టు భవనంలో సౌకర్యాలను, నిర్మాణ నాణ్యతను తనిఖీ చేశారు. త్వరలో నూతన కోర్టు భవనాలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, జూనియర్ సివిల్ జడ్జి కీర్తన, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రవి కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు,గౌరీశంకర రాజు, మురళి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘాట్‌లో లారీ బోల్తా



తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ లారీ బోల్తా పడింది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో భాగంగా సెట్టింగు కోసం వినియోగించిన వస్తువులను ఏపీ 03డీ 7625 నంబరు మినీ లారీలో ఎక్కించి తిరుపతికి బయలుదేరారు. 26వ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. డ్రైవర్ తిరుపతికి చెందిన శంకర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

న్యాక్ సెంటర్‌లో పీఎం విశ్వకర్మ శిక్షణ ప్రారంభం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6 : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సెంటర్‌లో శనివారం పీఎం విశ్వకర్మ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హస్తకళాకారుల వ్యాపార అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలని భావించిన కేంద్రం 18వృత్తులలో ఆధునికీకరణ, పునరుత్తేజం పెంపొందించడానికి ప్రధాన మంత్రి విశ్వకర్మ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఆయా వృత్తులలో ఆధునిక పనిముట్ల వినియోగం, శిక్షణ, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడంపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ప్రతాప్ మాట్లాడుతూ శిక్షణ అనంతరం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా పనిముట్ల కొనుగోలుకు రుణ సదుపాయం ఉందన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి మాట్లాడుతూ ప్రాథమిక శిక్షణ కార్యక్రమాలకు జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యాంమోహన్, లోకనాథం, నాక్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సును విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6: నగరంలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ(ఆరోగ్యకరమైన గ్రామం) అంశంపై జరగనున్న జాతీయ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ జాతీయ సదస్సుపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యే సదస్సుకు సంబంధించి ఏర్పాటు చేసిన 24 కమిటీలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, తిరుపతి ఆర్డీవో నిశాంత్ రెడ్డి, డీపీవో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

18వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె



తిరుపతి(విద్య), జనవరి 6: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. సంఘ గౌరవాధ్యక్షుడు నాగవెంకటేశ్ మాట్లాడుతూ అమరావతిలోని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని, త్వరలో ఉద్యోగులను చర్చలకు ఆహ్వానిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 34 మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపు

● వైసీపీ నేతల హస్తం ఉన్నట్టు గుసగుసలు

భారీ షెడ్డును తొలగించిన దృశ్యాలు





తిరుపతి రూరల్, జనవరి 6: పెరుమాళ్లపల్లె పంచాయతీ పరిధిలోని హథీరాంజీ మఠం భూముల్లో ఆక్రమణలను అధికారులు తొలగించారు. సర్వే నెంబరు 9-1లో నకిలీ పత్రాలతో ఓ వ్యక్తి భారీ రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తుండగా మఠం అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులను బేఖాతరు చేస్తూ తిరుపతి - చంద్రగిరి ప్రధాన రహదారి పక్కన భారీ రేకుల షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. విషయం తెలుసుకున్న హథీరాంజీ మఠం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు.. అధికారులతో కలిసి శనివారం అక్రమ కట్టడాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. ఆ సమయంలో ఆక్రమణదారుడు పెట్రోల్‌తో హైడ్రామా సృష్టించాడు. అప్పటికప్పుడు అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటుచేసి.. దళితులకు రక్షణ కల్పించాలని రచ్చ చేశాడు. ఈ నిర్మాణాలను కూల్చే సమయంలో రక్షణ కల్పించాలని తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించినా ఎవరూ స్పందించలేదని మఠం అధికారులు విచారం వ్యక్తం చేశారు. ఆక్రమణదారు తమపై రాళ్లదాడికి పూనుకున్నా భద్రత కొరవడిందని పేర్కొన్నారు. ఎండోమెంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్.. ఎస్పీకి రాత పూర్వకంగా రక్షణ కోరినా పోలీసులు స్పందించకపోవడం దారుణమని వాపోయారు. కాగా ఆక్రమణదారుల వెనుక వైసీపీ నేతల హస్తం ఉందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

శానిటరీ నాప్కిన్స్ పంపిణీ



రామచంద్రాపురం, జనవరి 6: మన సంస్కృతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పం బాదూరు గ్రామంలోని బీసీ హాస్టల్లోని 60మంది బాలికలకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్.కె.హరినాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నజీనా, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుపై చైన్ స్నాచర్ల దాడి



గాయపడిన స్టాఫ్ నర్సు నీరజ

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ స్టాఫ్ నర్సు మెడలోని గొలుసు చోరీ చేసేందుకు ఇద్దరు చైన్ స్నాచర్లు విఫలయత్నం చేశారు. ఆమె ప్రతిఘటించడంతో పరారయ్యారు. తొట్టంబేడు పీహెచ్‌సీ సిబ్బంది కథనం మేరకు.. తొట్టంబేడు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన నీరజ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. శనివారం నైట్ డ్యూటీ కోసం ద్విచక్ర వాహనంపై పీహెచ్‌సీ వద్దకు వచ్చింది. అక్కడ తన వాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై హెల్మెట్లు ధరించిన ఇద్దరు దుం డగులు వచ్చారు. హఠాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలు సు లాక్కె ళ్లేందుకు ప్రయత్నించారు. ఈ పెనుగులాటలో ఆమె రోడ్డుపై పడిపోవడంతో గాయ పడింది. అయినా ఆమె వారిని ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేయ డంతో దుండగులు పారిపోయారు. సహచర సిబ్బంది ఆమెకు చికిత్స అందించారు.



ప్రసంగిస్తున్న సిద్దేశ్వరానందభారతీస్వామి

సర్వం శక్తిమయం

రామచంద్రాపురం, జనవరి 6: సర్వం శక్తిమయమని కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరా నందభారతీస్వామి అన్నారు. రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో 2వేల మంది మహిళలతో సుహాసినీపూజ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మరకతశక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సుహాసిని పూజలో పాల్గొన్న 2వేల మంది మహిళలకు నిర్వాహకులు సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో శక్తిపీఠాధీశ్వరి రమ్యానందభారతీ స్వామి, తిరుపతి డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు చంద్రగిరి మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం

చంద్రగిరి, జనవరి 6: చంద్రగిరి మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం చంద్రగిరి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించనున్నారు. ఛైర్మన్‌గా కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా చేగు గోవర్ధన్ గుప్తా, డైరెక్టర్లుగా దాసరయ్యగారి మమత, ఉమ్మడి సురేఖ, షేక్ మహ్మద్ హుస్సెన్, తలారి సుజాత, పి.ఉమాదేవి, కె.రవీంద్రనాథ్‌రెడ్డి, సి.సరస్వతి, సీ.మోహన్‌రెడ్డి, పి.మల్లికార్జునరెడ్డి, ఎస్.భావజాన్, కె.మధన్ మోహన్‌రెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ ఆఫీసర్, తిరుపతి అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తిలు ప్రమాణం స్వీకారం చేయనున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి నాని, ఈశ్వర్‌రెడ్డి

ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని చూపుతా : పులివర్తి నాని

తిరుపతి రూరల్, జనవరి 6: తాను ఎమ్మెల్యే అయితే ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని చూపుతానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. అవిలాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పారిశుద్ధ్యం అవిలాల పంచాయతీలో అధ్వానంగా ఉందన్నారు. అర్హులైన అందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. కాగ అవిలాలకు చెందిన 27 రజక కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

దొంగోట్లపై అప్రమత్తంగా ఉండాలి

● బాబు ష్యూరిటీ ప్రతి ఇంటికీ చేరాలి ● టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేర్పుకున్న దొంగోట్లనే నమ్ముకున్నారని, వాటిపై మరింత అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, సురేంద్ర కుమార్ చెప్పారు. తిరుపతి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం కపిలతీర్థం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉన్నాయని, ఈనెల 15 వరకు ఉన్న సమయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఐదు చొప్పున ఫామ్-6 ఫిర్యాదులను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. తద్వారా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ప్రతి ఇంటికీ చేరాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్, శ్రీధర్ వర్మ, సింగంశెట్టి సుబ్బరామయ్య, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, మహేష్ యాదవ్, పుష్పావతి, కంకణాల రజినీకాంత్, రుద్రకోటి సదాశివం, మునిశేఖర్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, కృష్ణ యాదవ్, రామ్మూర్తి రాయల్, కేవి రమణ తదితరులు పాల్గొన్నారు.

నాదస్వర సంగీత ఉత్సవం ప్రారంభం



తిరుపతి (కల్చరల్), జనవరి 6: నాదబ్రహ్మ త్యాగరాజ స్వామి సంగీత ఆరాధనోత్సవాలలో భాగంగా శ్రీరామచంద్ర పుష్కరిణిలో శనివారం నాదస్వర సంగీత ఉత్సవం ప్రారంభమైంది. తిరుపతికి చెందిన వాద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి పాల్గొని మాట్లాడుతూ శ్రీరామచంద్రుని మనసా వాచా కొలిచి, చివరికి ఆయనలోనే ఐక్యమైన నాదబ్రహ్మ త్యాగరాజ స్వామి సంగీత ఆరాధనోత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరామభక్తిని తన కీర్తనల ద్వారా ప్రపంచానికి చాటిన త్యాగయ్య ధన్యజీవని తెలిపారు. రాత్రి 10.30 నుంచి అంతర్జాతీయ నాదస్వర డోలు విద్వాంసులు పాల్గొనే సంగీత కచేరి వేకువజాము నాలుగు గంటల వరకు జరిగింది.

వెంకన్న సేవలో ప్రముఖులు



జస్టిస్ నగేష్ - రామచంద్రరాజు, శ్రీనివాసులు - రాధాకృష్ణ

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్, శ్రీలంక ఎంపీ రాధాకృష్ణ, ఏపీ ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, బెంగాలీ నటుడు జీత్, కేజీఎఫ్ ఫేం రామచంద్ర రాజు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా.. దర్శనానంతరం రామచంద్రరాజు మాట్లాడుతూ.. 'భగీర' అనే పాన్ ఇండియా చిత్రంలో మంచి పాత్రలో నటిస్తున్నట్టు చెప్పారు. 'సలార్2' ద్వారా మరో సారి అభిమానుల ముందు రానున్నట్టు తెలిపారు. తమిళంలో కూడా నటిస్తున్నానన్నారు.



జీత్

వై నాట్ ఐపీసీ 307



కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా దీక్షా శిబిరంలో పాల్గొన్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 6: సీఎం జగన్‌పై ఐపీసీ 307 కింద కేసు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం పుత్తూరు పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించిన ఆయన కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికులు తమను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని కోరడం న్యాయబద్ధమేనని అన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ నేపథ్యంలో ఐదేళ్ల కిందటి వేతనాలే అందిస్తే ఆ కుటుంబాలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని, మున్సిపల్ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించడమే కాకుండా వేతనాలను సైతం పెంచుతామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు వేతనాల పెంపును అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మద్య నిషేధం అంటూనే ప్రభుత్వ ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటు చేసిన సీఎం జగన్ సొంత బ్రాండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంత మంది కిడ్నీ, లివర్ రోగులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో ఉండడానికి కారణం నాసిరకం మద్యమేనని ఆయన స్పష్టం చేశారు. దీనికి కారణమైన సీఎం జగన్‌పై ఐపీసీ 307 కింద కేసు నమోదు చేసి ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన జగన్ పక్కా వ్యాపారవేత్తగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంబీయూలో స్పోర్ట్స్ డే

చంద్రగిరి, జనవరి 6:ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఆదివారం స్పోర్ట్స్ డేను శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా సినీనటుడు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, ఎంబీయూ ఛాన్స్‌లర్ మోహన్‌బాబు, ప్రొఛాన్స్‌లర్ మంచు విష్ణు హాజరు కానున్నారు.

ఐసీసీలో సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రదర్శన



పోస్టర్స్, యాప్‌లను ప్రదర్శిస్తున్న సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యార్థులు

తిరుపతి(విద్య), జనవరి 6: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐసీసీ)రీజనల్ మీట్‌లో తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ చదివే విద్యార్థులు రూపొందించిన పోస్టర్స్, యాప్‌లను ప్రజంటేషన్ చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్ పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఎస్.కేశవనాథ్‌కుమార్, ఎస్.సాయిగణేష్‌రెడ్డి కంప్యూటర్ గేమింగ్‌పై రూపొందించిన త్రీడీ మోడలింగ్ యాప్స్, సోలార్ ఎనర్జీ టెక్నిక్స్‌పై పోస్టర్స్‌ని ప్రదర్శించి ప్రతిభచాటారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సుజిత్, డాక్టర్ బి.నారాయణబాబు మార్గదర్శకంలో పోస్టర్స్, యాప్స్‌ని తయారు చేసి ప్రదర్శించారని అన్నారు. విద్యార్థులను ఛైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, హెచ్‌వోడీ ఎస్.ఆనందరెడ్డి అభినందించారు.

టీడీపీతోనే బీసీలకు భవిష్యత్

జయహో బీసీ చైతన్య రథాలు ప్రారంభం



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, జనవరి6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీసీలను చైతన్యపరచడానికి ఏర్పాటుచేసిన రెండు చైతన్య రథాలను శనివారం రేణిగుంట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బీసీల కష్టాలను తెలుసుకుని, తగిన విధంగా అజెండా రూపొందించుకుని ప్రభుత్వపరంగా రాబోయే రోజుల్లో తగిన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో బీసీ జయహో రథాలను ప్రారంభించామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అన్ని విధాలుగా ఆదుకున్నామని, జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వవైభవం రావాలంటే అందరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, రెడ్డివారి గురవారెడ్డి, పుష్పావతి, కరాటే చంద్ర, మునస్వామి యాదవ్, మనోహరాచారి, జగన్నాథం, తులసీదాస్, రాజయ్య, శంకర్, అశోక్, గంధం బాబు, శ్రీనివాసులు, విశ్వనాథం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన



తిరుపతి (కల్చరల్), జనవరి 6 : ధనుర్మాసంలో సనాతనంగా వస్తున్న నగర సంకీర్తన కార్యక్రమాన్ని తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. గరుడ దీపంతో గోవిందరాజ స్వామి ఆలయ మాడవీధులు, గాంధీరోడ్డు, తిలక్ రోడ్డులలో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు 60 మంది భక్తులు గోవిందనామాలను ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపినాథ్ రెడ్డి, కేఎన్.రాజా, జేజి రెడ్డి, ఆమూరు సుబ్రమణ్యం, శాంబోలు హరినాథ్, టి.సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ వీసీని తొలగించాలి : ఎంఎస్ఎఫ్



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6: మాదిగ విద్యార్థి సంఘం (ఎంఎస్ఎఫ్) జాతీయ మహాసభల నిర్వహణకు అనుమతించని నాగార్జున యూనివర్సిటీ వీసీని పదవి నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. 6న ఏఎన్‌యూలో తలపెట్టిన ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభలకు అనుమతి నిరాకరించడం పట్ల ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద ఎంఎస్ఎఫ్ నిరసన తెల్పింది. సీఎం జగన్ ఈ విషయంలో చొరవ తీసుకొని వెంటనే అనుమతి ఇప్పించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ కోరారు. లేకపోతే ప్రత్యక్ష ఉద్యమానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, గోపీ మాదిగ, రాజేంద్ర, మస్తాన్, ప్రసాద్, మహేష్, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

ఎంజీఎం స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), జనవరి 6 : బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన భోగిమంటలు..కొత్తకుండలలో పొంగళ్లు..సంక్రాంతి లక్ష్మికి పూజలు, ముగ్గుల, గాలిపటాల పోటీలు వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలచాయి. అతిథులుగా వచ్చిన డిప్యూటీమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కొండారెడ్డి రాయలసీమ విద్యాసంస్థల డైరెక్టర్ వై.ఆనందరెడ్డి, కార్పొరేటర్ శాలిని, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్, ఎంఈవోలు బాలాజీ, భాస్కర్‌లతో టీచర్లు, విద్యార్థులు కలసి సంక్రాంతిసంబరాలను జరుపుకున్నారు. ఈసందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు వెల్లివిరిసే విధంగా మోడ్రన్ సంక్రాంతిని నిర్వహించారని అభినందించారు. ముగ్గుల పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వైసీపీ నాయకులు తూకివాకం మహేష్‌రెడ్డి, హెచ్ఎం మురుగన్, రిటైర్డ్ హెచ్ఎం అరుణ, టీచర్లు బండి మధుసూదన్‌రెడ్డి, ఎం.మునిశారద, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీకేఎస్‌లో ఘనంగా కాన్వొకేషన్ డే



తిరుపతి(విద్య),జనవరి6: రేణిగుంటరోడ్డులోని సీకేఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్‌సైన్సెస్ అండ్ రీసెర్చ్ కాలేజీల్లో ఫైనలియర్ చదివే విద్యార్థులకు శనివారం కాన్వొకేషన్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈస్నాతకోత్సవంలో అర్హులైన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, మాజీ ప్రిన్సిపాల్ రవీంద్రనాథరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం నియంతృత్వ పోకడలకు పరాకాష్ట

తిరుపతి(రవాణా)జనవరి 6: అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించడం వైసీపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు పరాకాష్ట అని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. జీవో 2 ద్వారా ఎస్మా ప్రయోగంతో ఆరు నెలల పాటు సమ్మెను నిషేధించడం దారుణమని పేర్కొన్నారు. అత్యవసర సర్వీసుల కిందకు రాని అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు తిరుపతిలో ప్రకృతి పంట మేళా


మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ రైతులు

తిరుపతి(తిలక్ రోడ్), జనవరి 6: నేడు తిరుపతి నగరంలో ప్రకృతి పంట మేళాను నిర్వహిస్తున్నట్టు విశ్రాంత ఉపాధ్యాయుడు, రైతు కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్ లో మీడియాతో మాట్లాడుతూ రాస్ భవనం వెనుక ఉన్న యూత్ హాస్టల్ ప్రాంగణంలో మేళా జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరూ కలిసి కనెక్ట్ 2 ఫార్మా సహాయ సహకారాలతో తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సేంద్రియ పంటమేళాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదర్శ రైతులను ఆహ్వానించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఉచితంగా శిక్షణ కూడా ఇస్తామన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనడానికి ఇది మంచి అవకాశం అన్నారు. వివరాలకు 6303606326 నెంబరును సంప్రదించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు మురళి, గోవర్ధన్‌నాయుడు, కుమార్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి (రవాణా), జనవరి 6 : పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమ్మెతో నగరం చెత్తమయమైందన్నారు. ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయని, విషజ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని తెలిపారు. సీఎం పార్టీ ప్రక్షాళనపై పెట్టిన శ్రద్ధ ప్రజా సమస్యలపై పెట్టడం లేదని విమర్శించారు. ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీలు ఇలా అన్ని వర్గాల వారు సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 57,441 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,878 మంది తలనీలాలు సమర్పించారు.

ఆకట్టుకుంటున్న లేపాక్షి కాటన్, సిల్క్ మేళా


లేపాక్షి కాటన్, సిల్క్ ప్రత్యేక ప్రదర్శన

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6 : సంక్రాంతిని పురస్కరించుకుని ఏపీ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డీపీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన లేపాక్షి కాటన్, సిల్క్ మేళా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోందని లేపాక్షి మేనేజర్ బి.పి.వెంకటేశం తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన వస్త్రాలు, వస్తువులను సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. వస్త్రాలతో పాటు టవల్స్, లుంగీలు, బెడ్‌షీట్స్, టాప్స్, చేనేత చీరలు ఉన్నాయన్నారు. ఈనెల 12వ తేదీ వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టూటౌన్ సీఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల టూటౌన్ సీఐగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గత సీఐ చంద్రశేఖర్ బదిలీపై వెళ్లడంతో కర్నూలు వీఆర్‌లో ఉన్న సత్యనారాయణ ఆ స్థానంలో నియమితులయ్యారు. శనివారం ఉదయం ఆయన తిరుమలలోని పోలీస్ కాంప్లెక్స్‌లో బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో భక్తులకు సేవలందించే అవకాశం రావడం పూర్వజన్మసుకృతమన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకెళతానని పేర్కొన్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


ప్రసంగిస్తున్న అన్వర్‌బాషా

తిరుపతి(లీగల్), జనవరి 6 : కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్‌బాషా కోరారు. శనివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ, హిందూ సక్సెసన్ యాక్ట్ గురించి న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి అన్వర్‌బాషా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. 10వ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ఏపీ బార్ కౌన్సిల్ మెంబరు గల్లా సుదర్శనరావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి జె.దేవరాజులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.గోపీచంద్, సీనియర్ న్యాయవాదులు మనోహర్, నాగరాజు, నరహరిరెడ్డి, విజయకుమార్, ఉదయ్‌కుమార్, చల్లా వెంకటయ్య, మావిళ్ల హరీష్, రాజశేఖర్, నెల్లూరు యోగానంద్, సుబ్రహ్మణ్యం, వేమారత్నం, ఆశాఅమీర్‌బీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మునిరత్నం ఆశయాలను కొనసాగిస్తాం

రాస్ డైరెక్టర్ నాగరాజు


రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 6 : రాష్ట్రీయ సేవా సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి గుత్తామునిరత్నం ఆశయాలను కొనసాగిస్తామని డైరెక్టర్ వి.నాగరాజు, సంయుక్త కార్యదర్శి మమత వెల్లడించారు. రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం మునిరత్నం 88వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మమత ప్రారంభించారు. రాస్ సంస్థను స్థాపించి వేలాది మందికి సేవలందించిన ఘనత డాక్టర్ గుత్తా మునిరత్నానికి దక్కిందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు యువరాజు, మోహన్, భాను, కవిత, నందిని తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో 14 నుంచి సంక్రాంతి వేడుకలు

తిరుపతి (కల్చరల్), జనవరి 6: గోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 14న భోగి తేరు, 15న మకరసంక్రాంతి, 16న గోదాకల్యాణం నిర్వహిస్తారని పేర్కొంది. కాగా భోగి రోజున సాయంత్రం ఆండాల్ అమ్మవారు, కృష్ణస్వామిని భోగి తేరుపై ఊరేగిస్తారని, 15న ఉదయం సంక్రాంతి తిరుమంజనం నిర్వహిస్తారని తెలిపింది. ఉదయం 6.30 గంటలకు కపిలతీర్థంలో చక్రస్నానం, ఆస్థానం ఉంటాయని, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవింద రాజస్వామి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపింది. 17వ తేదీ పార్వేట ఉత్సవం ఉంటుందని వెల్లడించింది.

ఎస్మాతో అంగన్వాడీలను భయపెట్టలేరు


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 6: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలను ఎస్మా చట్టం ప్రయోగించడం ద్వారా భయపెట్టాలనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి అన్నారు. శనివారం సాయంత్రం అంగన్వాడీ సిబ్బంది దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం హఠాత్తుగా ఎస్మాని ప్రయోగించడం, తక్షణం విధుల్లో చేరకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించడం సరికాదన్నారు. అత్యవసర సేవలుగా భావించే నీరు, విద్యుత్ సరఫరా, ఆస్పత్రులకు ఆ చట్టం వర్తిస్తుందని తెలిపారు. మూడు నెలల క్రితం సమ్మె నోటీసు ఇచ్చినపుడు అధికారులకు, మంత్రులకు ఎస్మా చట్టం ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయాలు చూసుకుంటామని బెదిరించి అభాసుపాలైందన్నారు. 26 రోజులుగా సీఎం నోరు మెదపపోవడం మహిళల పట్ల ఆయనకున్న గౌరవాన్ని తెలుపుతోందన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా, ఎన్ని చీకటి చట్టాలు తెచ్చినా అవేవి అంగన్వాడీల ఉద్యమం ముందు నిలబడవన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

రిలే దీక్షలు ప్రారంభం

తిరుపతిలో శనివారం నుంచి అంగన్వాడీలు రిలే దీక్షలు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుంచి వచ్చిన నాయకులతో కలిసి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ రిలే దీక్షల్లో పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ అంగన్వాడీలు నల్లటి రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మొదటి రోజు రిలే దీక్షలో అంగన్వాడీ నేతలు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌజన్య, పుష్ప, రేవతి, ధనమ్మ, గంగ, హైమావతి, శాంతి, సీఐటీయూ నగర కార్యదర్శి వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, నాగరాజమ్మ, వాణిశ్రీ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనంబి చెంతకు మలయప్పస్వామి

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి శనివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం తిరుమలనంబి ఆలయం వద్దకు వేంచేపు చేశారు. ఏటా తన్నీరుముదు ఉత్సవం మరుసటి రోజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తిరుమలనంబికి మేల్‌చాట్ శేష వస్త్రాన్ని సమర్పించారు. శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీవారి సేవలో తన జీవితాన్ని అర్పించిన తిరుమలనంబి సాక్షాత్తు రామానుజాచార్యులకు మేనమామ. ఈ కార్యక్రమంలో తిరుమల జీయర్‌స్వాములు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ముంచేసిన జగన్

- రానున్న ఎన్నికల్లో వైసీపీ ఇంటికిపోవడం ఖాయం
- తెలుగు యువత నేత అక్షింతల కృష్ణయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న అక్షింతల కృష్ణయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 6: బూటకపు మాటలతో రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం జగన్ నిలువునా ముంచేశాడని, రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపడం ఖాయమని తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక కొత్త పరిశ్రమలు రాక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కల్తీమద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో 21,575మంది యువత ఆత్మహత్య చేసుకున్నారని పార్లమెంటు సాక్షిగా కేంద్ర వెల్లడించిందన్నారు. అలాగే రాష్ట్రంలో మత్తు పదార్థాలకు బానిసలై 2021లో 571మంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్‌సీఆర్‌సీ నివేదిక వెల్లడించిందని తెలిపారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పరిశ్రమల ద్వారా 5,13,351మందికి ఉద్యోగాలు వచ్చినట్లు అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వెల్లడించారన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పేందుకు విద్యార్థులు, యువత సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సందీప్, శ్రీనివాసులు, బాబి, రఫీ, లోకేష్, గోపి, శ్రీను, జగదీష్, దిలీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆపస్ డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ


ఆపస్ డైరీ, క్యాలెండరును ఆవిష్కరిస్తున్న డీఈవో శేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి

తిరుపతి(విద్య), జనవరి 6: కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఏపీ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) డైరీ, క్యాలెండరును డీఈవో డాక్టర్ వి.శేఖర్ శనివారం ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూకివాకం నాగరాజు, గట్ల సాంబిరెడ్డితో కలసి విడుదల చేశారు. డీఈవో మాట్లాడుతూ దేశభక్తి, జాతీయభావం పెంపొందించే విధంగా డైరీని రూపొందించారని అభినందించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు టీచర్లు పనిచేయాలని ఆకాంక్షించారు. కోశాధికారి ఎ.పట్టాభి, సహాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, కార్యదర్శి మహేష్, నాయకులు పురుషోత్తంరాజు, సుబ్రమణ్యం, నాంచారయ్య పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో స్కౌట్స్ టీచర్లకు శిక్షణ


టీచర్లతో హెచ్‌ఎం వంశీరాజా

తిరుపతి(విద్య), జనవరి 6 : ఎంఆర్‌పల్లెలోని జడ్పీహైస్కూల్‌లో తిరుపతి అర్బన్, రూరల్ మండలాల్లో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల టీచర్లకు శనివారం (బిగినర్స్ కోర్సు) శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం ఆర్.వంశీరాజా మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయభావం, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎం.జయరాం, అడల్ట్ రిసోర్స్ కమిషనర్ ఎంఎం రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.కుప్పిరెడ్డి, బాలిప్రసాద్, జి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేకహోదా సాధ్యం



నిరసన తెలుపుతున్న చింతామోహన్ తదితరులు

గూడూరు, జనవరి 6: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తామన్నారు. సీఎం జగన్ ఎన్నికల సమయంలో 20 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా తెస్తానని నమ్మించి గెలిచిన తరువాత ప్రజలను మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెబాట పట్టారన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ను ఆందోళన ప్రదేశ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, నెహేమ్యా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి డిపాజిట్లు దక్కవు

వెంకటగిరిటౌన్, జనవరి 6: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవని మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ అన్నారు. శనివారం పట్టణంలో పర్యటించారు. పోలేరమ్మ ఆర్చి వద్ద ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంతో సీఎం జగన్‌కు వణుకు పుట్టిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18వ రోజుకు ఎస్ఎస్ ఉద్యోగుల సమ్మె

తిరుపతి(విద్య), జనవరి 6: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 18వ రోజుకు చేరుకుంది. సంఘ గౌరవాధ్యక్షుడు నాగవెంకటేశ్ మాట్లాడుతూ అమరావతిలోని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని, త్వరలో ఉద్యోగులను చర్చలకు ఆహ్వానిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు.

రాత్రికి రాత్రే గుడిసెలు, దుకాణాల ఏర్పాటు





వరదయ్యపాళెం, జనవరి 6: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీలోని వీకేఆర్‌పి కాలనీ వద్ద రాత్రికి రాత్రే అక్రమంగా గుడిసెలు వెలిశాయి. హీరో పరిశ్రమ శ్రీసిటీ ప్రధాన రహదారిలో ఈ గుడిసెలు ఏర్పాటు చేశారు. కొందరు ఏకంగా దుకాణాలే నిర్మించేశారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ అండతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారని కాలనీలోని గిరిజనులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాళెం, జనవరి 6: వరదయ్యపాళెం, బత్తలవల్లం, చిన్న పాండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వైసీపీ అరాచకపాలనకు స్వస్తిపలకాలి

గూడూరు, జనవరి 6: వైసీపీ నాలుగున్నరేళ్ల నుంచి సాగిస్తున్న అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వస్తి పలకాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ శనివారం అన్నారు. రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పి టీడీపీని గెలిపించాలని తెలిపారు.

నేడు తిరుపతిలో ప్రకృతి పంట మేళా

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 6: నేడు తిరుపతి నగరంలో ప్రకృతి పంట మేళాను నిర్వహిస్తున్నట్టు విశ్రాంత ఉపాధ్యాయుడు, రైతు కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ రాస్ భవనం వెనుక ఉన్న యూత్ హాస్టల్ ప్రాంగణంలో మేళా జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరూ కలిసి కనెక్ట్ 2 ఫార్మ్ సహాయ సహకారాలతో తమ ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సేంద్రియ పంటమేళాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదర్శ రైతులను ఆహ్వానించి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఉచితంగా శిక్షణ కూడా ఇస్తామన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనడానికి ఇది మంచి అవకాశం అన్నారు. వివరాలకు 6303606326 నెంబరును సంప్రదించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు మురళి, గోవర్ధన్ నాయుడు, కుమార్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

18నుంచి జాతీయ సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6: తిరుపతిలో ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ(ఆరోగ్యకరమైన గ్రామం) అంశంపై జరగనున్న జాతీయ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ జాతీయ సదస్సుపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరయ్యే సదస్సుకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్,డీఆర్వో, డీపీవో తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో జీవో నెంబరు 2 ప్రతులను తగలబెడుతున్న అంగన్వాడీలు - సూళ్లూరుపేటలో దీక్ష

డిమాండ్లు పరిష్కరించమంటే బెదిరింపులా?

నాయుడుపేట టౌన్, జనవరి 6: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తుంటే విధులకు హాజరుకావాలని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమని అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ అన్నారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 2వ ప్రతులను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని 26 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం శనివారం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ జీవో ఇవ్వడం దుర్మార్గమన్నారు. సమ్మె చేపట్టిన నాటినుంచి అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ఇలాగే ఇబ్బందులు పెడితే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, అంగన్వాడీ సంఘ నాయకులు నాగమణి, కళావతి, సంధ్య, వాణి, చెంగమ్మ, బుజ్జమ్మ తదితరులు ఉన్నారు.

గూడూరు: అంగన్వాడీలు డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం మొండివైఖరిని వీడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 26వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీలు 26 రోజులుగా దీక్ష చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, రమణయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, చంద్రయ్య, పెంచలమ్మ, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరి: బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె శనివారం 26 వ రోజు కొనసాగింది. వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగే కొద్దీ ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూపారాణి, మంజుల, సుభాషిణి, మమ్ములా బేగం, లక్ష్మి ప్రసన్నా తదితరులు ఉన్నారు.

కోట: రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కోటలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శనివారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. తక్షణమే విధులకు హాజరుకావాలంటూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను అంగన్వాడీలు దీక్షా శిబిరం వద్ద తగులబెట్టారు. తమ డిమాంట్లను పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని తేల్చిచెప్పారు.

సూళ్లూరుపేట: ప్రభుత్వం కళ్లు తెరచిచూస్తే అంగన్వాడీల కష్టాలు తెలుస్తాయని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద రిలే నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు వారాలుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా విధులకు హాజరుకాకపోతే చర్యలు తీసుకొంటామని బెదిరించడం సమంజసం కాదన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపకుండా బెదిరిస్తే భయపడబోమని, ఆదిపరాశక్తిలా విజృంభిస్తామన్నారు. తామేమీ కొత్తగా కోర్కెలు కోరవడం లేదని, సీఎం చెప్పిన హామీలను మాత్రమే నెరవేర్చమని అడగుతున్నామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. వీరికి సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అల్లెయ్య, చంద్రశేఖర్, రమణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తిరుపతి(లీగల్), జనవరి 6: కాలానుగుణంగా మారుతున్న చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్‌బాషా కోరారు. శనివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ, హిందూ సక్సెసన్ యాక్ట్ గురించి న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి అన్వర్‌బాషా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. 10వ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ఏపీ బార్ కౌన్సిల్ మెంబరు గల్లా సుదర్శనరావు, ఐలు రాష్ట్ర కార్యదర్శి జె.దేవరాజులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి.గోపీచంద్, సీనియర్ న్యాయవాదులు మనోహర్, నాగరాజు, నరహరిరెడ్డి, విజయకుమార్, ఉదయ్‌కుమార్, చల్లా వెంకటయ్య, మావిళ్ల హరీష్, రాజశేఖర్, నెల్లూరు యోగానంద్, సుబ్రహ్మణ్యం, వేమారత్నం, ఆశాఅమీర్‌బీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అన్వర్‌బాషా

టీడీపీతోనే బీసీలకు భవిష్యత్

జయహో బీసీ చైతన్య రథాలు ప్రారంభం



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీసీలను చైతన్యపరచడానికి ఏర్పాటుచేసిన రెండు చైతన్య రథాలను శనివారం రేణిగుంట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బీసీల కష్టాలను తెలుసుకుని, తగిన విధంగా అజెండా రూపొందించుకుని ప్రభుత్వపరంగా రాబోయే రోజుల్లో తగిన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో బీసీ జయహో రథాలను ప్రారంభించామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను అన్ని విధాలుగా ఆదుకున్నామని, జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వవైభవం రావాలంటే అందరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, రెడ్డివారి గురవారెడ్డి, పుష్పావతి, కరాటే చంద్ర, మునస్వామి యాదవ్, మనోహరాచారి, జగన్నాథం, తులసీదాస్, రాజయ్య, శంకర్, అశోక్, గంధం బాబు, శ్రీనివాసులు, విశ్వనాథం, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవమే గ్యారెంటీ



గొల్లపల్లి దళితవాడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 6: విజన్- 2020 పేరుతో పాతికేళ్ల క్రితమే రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి సాధించాలో ఊహించి, అందుకు తగ్గట్టుగా పరిపాలన చేయడమే కాకుండా విజన్‌ను సాకారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి అనుభవమే రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ అని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లపల్లిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విప్లవాన్ని ముందుగానే పసిగట్టి అందుకు తగ్గట్టుగా రాష్ట్రంలో యువతను మెళికలుగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం సగర్వంగా తలెత్తుకుని జీవించేందుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకే మహానాడు వేదికగా చంద్రబాబు ఆరు గ్యారెంటీలను ప్రకటించారని గుర్తు చేశారు. వైసీపీ దుర్మార్గపు పరిపాలన, అవినీతితో నష్టపోయిన రాష్ట్రం మళ్లీ గాడిన పడాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా నగరి నియోజకవర్గం అభివృద్ధికి దూరమైపోయిందని రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి భానుప్రకాష్‌కు మద్దతు పలికి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట గజపతి, చిన్నబ్బ, విజయభాస్కర్‌రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

గురువు సకల జ్ఞానానికి మూలం



అష్టావధాని భరత్ శర్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నారాయణవనం, జనవరి 6: గురువు సకల జ్ఞానానికి మూలమని ప్రధానోపాధ్యాయురాలు మనోహరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని, పాలమంగళం జడ్పీ హైస్కూల్‌లో నారాయణ గోసేవ ట్రస్టు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అష్టావధాని ఉప్పల దడియం భరత్ శర్మ అష్టావధాన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణ, దిశ, దశ నేర్పేది గురువని అన్నారు. అనంతరం అష్టావధాని భరత్ శర్మను, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు సామా మునికృష్ణయ్యను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్, మోహన్ కుమార్, నాగేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కాళప్ప, ఉపాధ్యాయులు సుబ్బరాజు, బలరామయ్య, రాజా, ధనంజయులు, గోపీశైలజ, సరిత, సుధాకర్, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, జనవరి 6: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మత్తు పదార్థాలకు లోను కాకుండా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. స్త్రీల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు కలుషిత ఆహారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా జంక్ ఫుడ్ తీసుకోకూడదన్నారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ విద్యార్థులు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే బహుమతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులు జైలు జీవితం గడపాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జనవరి 6: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున తిరుప్పావై పాశురాలు పఠిస్తూ స్వామివారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు.

పుత్తూరు రూరల్ సీఐగా భాస్కర నాయక్



నారాయణవనం, జనవరి 6: పుత్తూరు రూరల్ సీఐగా భాస్కర్ నాయక్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడున్న సీఐ సురేష్ తిరుపతికి బదిలీ అయ్యారు.

వై నాట్ ఐపీసీ 307



కార్మికులకు మద్దతుగా కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని దీక్షలో పాల్గొన్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 6: సీఎం జగన్‌పై ఐపీసీ 307 కింద కేసు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం పుత్తూరు పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటించిన ఆయన కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికులు తమను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని కోరడం న్యాయబద్ధమేనని అన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ నేపథ్యంలో ఐదేళ్ల కిందటి వేతనాలే అందిస్తే ఆ కుటుంబాలు ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని, మున్సిపల్ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించడమే కాకుండా వేతనాలను సైతం పెంచుతామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు వేతనాల పెంపును అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మద్య నిషేధం అంటూనే ప్రభుత్వ ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటు చేసిన సీఎం జగన్ సొంత బ్రాండ్లను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంత మంది కిడ్నీ, లివర్ రోగులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో ఉండడానికి కారణం నాసిరకం మద్యమేనని ఆయన స్పష్టం చేశారు. దీనికి కారణమైన సీఎం జగన్‌పై ఐసీపీ 307 కింద కేసు నమోదు చేసి ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా పరిపాలన, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన జగన్ పక్కా వ్యాపారవేత్తగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు మహేష్, నాయకులు గోపి, గణేష్‌కుమార్, చందు, భారతి, మణి, విజయ్‌కుమార్, యాకోబు, అంకయ్య, గోవిందస్వామి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, మాజీ వైస్ ఛైర్మన్ ఆనంద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్.ధనపాల్, తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీఎస్ గణేష్, రైతు విభాగం రాష్ట్ర నాయకుడు బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను నమ్మి వీధిపాలైన అంగన్వాడీలు



పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నడిరోడ్డుపై భోజనాలు చేస్తున్న అంగన్వాడీలు

పుత్తూరు అర్బన్, జనవరి 6: సీఎం జగన్‌ను నమ్మి అంగన్వాడీలు వీధి పాలయ్యారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ ధ్వజమెత్తారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నడిరోడ్డుపై కూర్చుని భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. పైగా అంగన్వాడీలు విధులకు హాజరుకావాలని జీవో నెంబర్ 2 తీసుకువచ్చి కార్యకర్తలను బెదిరించడం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అంగన్వాడీలు సమ్మె చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఓట్లు కోసం అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన జగన్ మళ్లీ రెండు నెలల్లో అదే ఓట్లు కోసం తమ వద్దకు రావాలనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఇన్ని రోజులుగా అంగన్వాడీలు పోరాటం చేస్తుంటే కనీసం మానవతా దృక్పథంతో కూడా చర్చలకు పిలవకపోవడం రాష్ట్ర ప్రభుత్వ పెద్దల అహంకారానికి పరాకాష్టగా అభివర్ణించారు. ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను విరమించబోమని అధికారులు నోటీసుల పేరుతో చేసే బెదిరింపులకు వెరవబోమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయకుమారి, మోహనలక్ష్మి, హైమావతి, అన్నపూర్ణ, లలిత, రాధ, పద్మజ, గంగులమ్మ, కృష్ణవేణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

వడమాలపేట, జనవరి 6: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. వడమాలపేటలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.36 వేల రికవరీకి ఆదేశించారు. 2022-23 సంవత్సరానికి రూ.8,10,43,500 మేరకు చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. రానున్న వేసవిలో ఎండ తీవ్రత కోసం కూలీలకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి పనులు చేసేందుకు గ్రామాల్లో మహిళలు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో డీవీవో భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మన్ రాసరాయ నాయుడు, ఎంపీడీవో భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాస్ సేవా కార్యక్రమాలు హర్షణీయం

పుత్తూరు టౌన్, జనవరి 6: మహిళలను ఆర్థిక ఎదుగుదలకు దోహదం చేసే విధంగా రాష్ట్రీయ సేవా సమితి(రాస్) చేస్తున్న కార్యక్రమాలు హర్షణీయమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కల్యాణ్ అన్నారు. శనివారం రాస్ వ్యవస్థాపకుడు డాక్టర్ గుత్తా మునిరత్నం జయంతి సందర్భంగా జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం అధికారి హరిబాబు ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు, బ్యూటీషియన్, ఆర్యవర్క్ కిట్లు, వృద్ధులకు నిత్యవసరాలు వస్తువులు, చేతి కర్రలు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, ప్రకాష్, కమల, తేజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు వితరణ చేస్తున్న రాస్ అధికారులు

కాపులను దగా చేసిన వైసీపీ : జనసేన



కాపు భవనం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వినుత

శ్రీకాళహస్తి, జనవరి : కాపులను వైసీపీ దగా చేసిందని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినుత విమర్శించారు. అయ్యలనాడు చెరువులోని కాపు భవనం స్థలాన్ని శనివారం జనసేన నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కాపు భవన నిర్మాణం కోసం కోటి రూపాయల విరాళం ప్రకటించి ఐదేళ్లు గడిచినా ఇప్పటివరకు అక్కడ పునాదులు కూడా పడలేదన్నారు. వైసీపీలోని కాపీ నేతలు ఆ పార్టీని వీడి జనసేనలో చేరితే తాము వెంటనే కోటి రూపాయలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను జయప్రదం చేద్దాం

కేవీబీపురం, జనవరి 6: ఈ నెల 12, 13, తేదీలలో కర్నూలులో జరిగే ఎస్టీయూ వజ్రోత్సవ సభలను జయప్రదం చేద్దామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి పిలుపునిచ్చారు. శనివారం ఆదర్శ పాఠశాలలో ఎస్టీయూ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు లక్ష్మయ్య, గుమ్మడి మురళి, చంద్రశేఖర్, శ్రీహరి, జయకుమార్, ఎస్టీయూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'9వ వార్డులో ఇంటింటికీ మీ బొజ్జల'

శ్రీకాళహస్తి జనవరి 6: టీడీపీ నాయకులు బొజ్జల రిషితారెడ్డి పట్టణంలో 9వార్డు పరిధిలో శనివారం 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మాజీ కౌన్సిలర్ సుప్రజ, నాయకులు కరీం, పండు తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనతో రాష్ట్రం అధోగతి

సైకో పాలనతో రాష్ట్రం అధోగతి చెందిందని మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దౌర్జన్యాలు, అక్రమ కేసులతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న పోతుగుంట రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి జనవరి 6: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని టీడీపీ నాయకులు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు అన్నారు. తెలుగు గంగ కాలనీలోని గురుకుల పాఠశాలలో శనివారం 'వినియోగదారుల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన' అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, న్యాయవాది మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వండి

సత్యవేడు, జనవరి 6: రానున్న ఎన్నికల్లో సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఎస్సీసెల్ సీనియర్ నాయకుడు ఎం.పి.రవి కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనకు ఓ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డబ్బే ప్రధానంగా కాకుండా స్థానికంగా ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



వికృతమాలలో ప్రచారం చేస్తున్న హేమాక్షి తదితరులు

ఏర్పేడు, జనవరి 6: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పూల హేమాక్షి అన్నారు. ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని విజ్ఞప్తిచేశారు.

నిత్య భజనలకు అవకాశం కల్పించండి

శ్రీకాళహస్తి జనవరి 6: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణంలో శివనామ సంకీర్తనలతో నిత్య భజన చేసుకునే అవకాశం కల్పించాలని అన్నమయ్య జానపద కళాక్షేత్రం సభ్యులు కోరారు. ఈ మేరకు ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు శనివారం వినతిపత్రం సమర్పించారు. పాలక మండలి సమావేశంలో తీర్మానం చేస్తామని ఛైర్మన్ అంజూర్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జానపద కళాక్షేత్రం జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి జనవరి 6: ముక్కంటి ఆలయానికి సమీపంలోని భరద్వాజ తీర్థంలో వెలసిన చెంచులక్ష్మి సమేత నరసింహస్వామికి ధనుర్మాసం పురస్కరించుకుని విశేష పూజలు జరిగాయి. కలశ స్థాపనతో సంకల్పం పూజలు చేశారు. పూజా ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి విశేష పూజలు

శ్రీకాళహస్తి జనవరి 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: బీజేపీ

సత్యవేడు, జనవరి 6: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప పిలుపునిచ్చారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సత్యవేడు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

పింఛన్ల జాప్యం బాధాకరం

శ్రీకాళహస్తి, జనవరి 6: ఎమ్మెల్యే అందుబాటులో లేరని పింఛన్ల పంపిణీ జాప్యం చేయడం బాధాకరమని టీడీపీ గాండ్ల రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు హరిబాబు శనివారం ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. మందులు, ఇతర అత్యవసరాల కోసం వృద్ధులు, దివ్యాంగులు, పింఛన్ కోసం ఎదురుచూస్తూ ఉన్నారని తెలియజేశారు.

త్యాగరాజ స్వామి ఆరాధనకు విరాళం

శ్రీకాళహస్తి, జనవరి 6: త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవానికి శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత రూ.6వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శనివారం త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలకు ఆమెను ఆహ్వానించారు. ఈ క్రమంలో విరాళం అందించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ఒకరికి గాయాలు

ఏర్పేడు, జనవరి 6: ఏర్పేడు నుంచి వెంకటగిరి వైపు వెళుతున్న ఆటోను వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వస్తున్న లారీ నచ్చనేరి పంచాయతీ దుర్గపురి వద్ద ఢీకొంది. ఆటో డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌ది రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ రామకృష్ణా పురం. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు పెంచేవరకు సమ్మె ఆగదు

కళ్లకు గంతలతో అంగన్వాడీల నిరసన



రేణిగుంటలో మోకాళ్లపై నిరసన, శ్రీకాళహస్తిలో కొనసాగుతున్న దీక్ష, పిచ్చాటూరులో కళ్లకు గంతలతో నిరసన

సత్యవేడు, జనవరి 6: ఎస్మా చట్టంపై సత్యవేడులో అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. సీటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు కాంతమ్మ, భారతి, ఝాన్సీ, నాగరాజు, స్వర్ణలత, గీత, చందామల్లె, మంజుల, హేమావతి, సీఐటీయూ నాయకులు బాషా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: జీతాలు పెంచేవరకు తాము సమ్మె ఆపేదిలేదని అంగన్వాడీలు తేల్చిచెప్పారు. స్థానిక పాత ఎమ్మార్వో కార్యాలయం వద్ద శిబిరంలో శనివారం కళ్లకు గంతలు కట్టుకొని, మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. సంఘం నాయకులు ధనమ్మ, రాధ, వెంకటరమణ, మురళి, హరినాథ్, కుప్పస్వామి, సెల్వరాజ్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు: సీఎం జగన్ తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసినట్లు అంగన్వాడీలను ఎస్మా చట్టంతో ఉద్యోగాల నుంచి గెటేయాలంటే కుదరదని న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ మండి పడ్డారు. పిచ్చాటూరులో అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఎస్మా జీవోను దగ్ధం చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తడుకు బ్రాంచ్, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా.

బంగారు నగలు వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న రుణము గడువు మీరిన తర్వాత కూడా పలు నోటీసులు పంపినా అప్పు చెల్లించియుండలేదు. సదరు అప్పు వసూలు కొరకు బ్యాంకు నిబంధనలను అనుసరించి 16-01-2024, మంగళవారం, సాయంత్రం 4:30 గంటలకు బ్యాంకు ఆవరణములో బహిరంగంగా వేలము ద్వారా సదరు నగలు విక్రయించి అప్పుకు జమచేయబడును. షరతులు: 1) ఇదివరకు నోటీసు చేరనియెడల ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2) ఈ ప్రకటన ఖర్చు అప్పుదారుడే భరించవలెను. 3) వేలంలో పాల్గొనదలచినవారు రూ॥ 10,000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 4) వేలం పొందినవారు మిగిలిన సొమ్ము వెంటనే చెల్లించి నగలు స్వాధీనం చేసుకోవలెను. లేనిచో ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. 5) ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు బ్యాంకు వారికి అధికారము కలదు.

వ. నెం.	రుణ ఖాతా నెం.	అప్పుదారుని పేరు/భర్త/తండ్రి మరియు చిరునామా	బంగారు నగల తూకం గ్రా.ల్లో	బకాయి రూ॥ల్లో
1.	39690336536	యాసారపు ప్రవీణ్ కుమార్ తండ్రి వై.బాలాజి, టి.ఆర్.కండ్రిగ కాలనీ, తడుకు, పుత్తూరు మండలం	15.8 గ్రాములు	70,000/-

సం/- బ్రాంచ్ మేనేజర్, తడుకు బ్రాంచ్, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి: మున్సిపల్ కార్మికులు



నిరసన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాళహస్తి జనవరి 6: ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడి మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి డిమాండు చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం పెండింగ్ సమస్యలపై మున్సిపల్ కార్మికులు నిరసన ర్యాలీ, ధర్నా చేశారు. జయరాం రావు పార్కు నుంచి మొదలైన ర్యాలీ పుర వీధుల మీదుగా పురపాలక సంఘ కార్యాలయం వరకు చేరుకుంది అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ కరోనా కాలంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపి, మున్సిపల్ కార్మికులు జాన్, హరినాథ్, వెంకటేష్, కొండమ్మ, మురళీకృష్ణ, రామకృష్ణ, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ

ఏర్పేడు, జనవరి 6: రాష్ట్రీయ సేవాసమితి వ్యవస్థాపకులు పద్మశ్రీ గుత్తా మునిరత్నం జయంతిని పురస్కరించుకుని రాస్ మహిళా భారతి జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పాపానాయుడుపేట కార్యాలయంలో శనివారం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ, బ్యూటీషియన్ శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజశేఖర్‌నాయుడు, వేణుగోపాల్ చౌదరి, సర్పంచ్ లలిత, కమిటీ ఛైర్మన్ తంబా సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ ఆఫీసర్ హరిబాబు, రాస్ మహిళా భారతి ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీరెడ్డి, డ్రగ్ డి అడిక్షన్ ప్రాజెక్టు అధికారి అన్నాదొరై పాల్గొన్నారు. అనంతరం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు, హ్యాండ్ స్టిక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటకుమార్, మునీంద్ర, మహేష్, మునిపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుపై చైన్ స్నాచర్ల దాడి



గాయపడిన స్టాఫ్ నర్సు నీరజ

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ స్టాఫ్ నర్సు మెడలోని గొలుసు చోరీ చేసేందుకు ఇద్దరు చైన్ స్నాచర్లు విఫల యత్నం చేశారు. ఆమె ప్రతిఘటించడంతో పరారయ్యారు. తొట్టంబేడు పీహెచ్‌సీ సిబ్బంది కథనం మేరకు.. తొట్టంబేడు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన నీరజ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. శనివారం నైట్ డ్యూటీ కోసం ద్విచక్ర వాహనంపై పీహెచ్‌సీ వద్దకు వచ్చింది. అక్కడ తన వాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై హెల్మెట్లు ధరించిన ఇద్దరు దుండగులు వచ్చారు. హఠాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలు సు లాక్కె ళ్లేందుకు ప్రయత్నించారు. ఈ పెనుగులాటలో ఆమె రోడ్డుపై పడిపోవడంతో గాయపడింది. అయినా ఆమె వారిని ప్రతిఘటిస్తూ గట్టిగా కేకలు వేయ డంతో దుండగులు పారిపోయారు. సహచర సిబ్బంది ఆమెకు చికిత్స అందించారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా. హెలెన్

సత్యవేడు, జనవరి 5: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేలా ప్రజలను చైతన్యపరచాలని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ ఆ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో హెలెన్ అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఈ సైకో పాలన నుంచి కాపాడు కునేందుకు ప్రతి ఒక్కరు కదలి రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు హేమలత, ఎస్సీవీ నాయుడు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Shaik Javid Basha S/o Shaik Shajahan (Old Name), R/o. D.No.6-237-9-20c, Devalam Street, Madanapalle, Annamayya Dist., A.P., India, have Changed My Name As Shaik Javeed Basha, (New Name)
AJT - XM

CHANGE OF NAME
I, Doddipalle Dwarakanatha Reddy (Old Name) R/of H No. 3-161-21-5-A-1, S.B.I Colony, Madanapalle - 517325, Annamayya Dist, AP. I Have Changed My Name To Doddipalli Dwarakanatha Reddy (New Name).
AJT - 1613

TOURS
శ్రీలంక 7N/D - 57,500 = 08-02-2024, సింగపూర్/మలేషియా 5N/6D - 87,500 = 25-02-2024; బ్యాంకాక్ 4N/5D - 47,500 = 25-03-2024; దుబాయ్ 4N/5D - 87,500 = 10-03-2024, Cont. : SSKT Tours, మదనపల్లె. సెల్ : 9440359204, 9912652025
AJT - 155123

TOLET
2 BHK Flat No 301 West Facing ,as Per Vasthu with Latest Aminities with Cupboards, Car Parking 24hrs Water, Rent/Lease, Konduru Homes, Near Reddy Bhavan, Karakambadi Road, Rent : 15000, Tirupathi. Ph:98482 26551.
AJT - 1604

PLOT FOR SALE
తిరుపతి, ఎయిర్‌పోర్టు దగ్గరలోని కుర కాల్వ నందు గల VVR వెంచర్లో 30X40=33 1/2 అంకణముల ఖాళీ స్థలము అమ్మబడును. డైరెక్ట్ ఓనర్, ప్లాటు-13 సెల్ :- 63023 99367
AJT - 179557

FLAT FOR SALE
Rs.4,500/- Sqft, 2BHK With Wood Work, Car Parking, Near SBI Training Centre, TML Bypass, Tirupati Ready to Occupation, 100% Vasthu. Cell: 70957 01056
AJT-5924

HOUSE FOR SALE
తుడా అప్రూవల్, న్యూ ఇండిపెండెంట్ హౌస్, కార్ పార్కింగ్, 2 BHK రేణిగుంట రోడ్డు, చదలవాడ కాలేజి వెనుక, లక్ష్మీనగర్ కాలని, తిరుపతి. సెల్ : 98499 59305, 90526 74774
AJT - 5978

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, టెస్టింగ్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 150685

FLAT FOR SALE
INDIVIDUAL 2BHK - East facing, Fully furnished Flat for SALE! with Car Parking At New Cherlopalli, Pudhipatla,Tirupati 9059654707
AJT - 10182

WANTED
ప్రముఖ సంస్థ & Govt చే Approve పొందిన భీమా సంస్థ నందు పనిచేయుటకు Team Leaders కావలెను. Exp. ఇన్సూరెన్స్/మ్యూచువల్ ఫండ్స్ / జనరల్ ఇన్సూరెన్స్ & హెల్త్ ఇన్సూరెన్స్ వారికి ప్రాధాన్యత. సంప్ర. : 63033 45396, 86885 90609.
AJT - 1612

DIABETES
Best diabetes physician in Tirupati, Reva diabetes Clinics, Dr Rekha Kaltulu MBBS DFM (UK), F.Diab (Msc Diabetes UK). Call: 63016 32678
AJT-155087

PLOT FOR SALE
ప్రపంచ ప్రఖ్యాతి పొందిన తిరుపతి విమానాశ్రయం ఎదురుగా ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీస్ ప్రక్కన తుడా అప్రూవ్ కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును. డైరెక్ట్‌గా సంప్ర : 8096783848.
AJT - 5951

క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి